క్లుప్తంగా

1 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

రోలుగుంట: వచ్చే నెల 1 నుంచి 19వ తేదీ వరకూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈవో-2 జగ్గారావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్లకు, చీఫ్ సూపరింటెండెంట్లకు, నిర్వహణ సిబ్బందికి ఈ నెల 29న స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది విధిగా హాజరు కావాలని తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: వి.జె.పురం ఎంపీపీ పాఠశాలలో 50 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జగదీశ్ తన సొంత నిధులతో వీటిని సమకూర్చారు. ఓమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బోద్దాపు భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు సత్యవతి, మాజీ సర్పంచ్ హరికృష్ణ, పాల సొసైటీ అధ్యక్షుడు గొల్లవిల్లి విజయకుమార్, కర్రి నాగేశ్వరరావు, పూసర్ల వెంకట్రావు, పీఏసీఎస్ డైరెక్టరు శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో పారిశుధ్య పనులు



పనులు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామంలో 17 వేలకుపైగా జనాభా ఉండటంతో పారిశుధ్య సమస్య లేకుండా సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాస్‌ల పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు. మంగళవారం గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లతో మురుగును జేసీబీ తొలగింపు కార్యక్రమం చేపట్టారు. చిన్న, చిన్న కాలువల్లో పేరుకుపోయిన పూడిక కూలీలతో తొలగించినట్లు వారు తెలిపారు.

కలుషిత నీరు సరఫరాతో ఇబ్బందులు



కోటవీధిలో కుళాయిల ద్వారా వచ్చిన కలుషితనీరు

చోడవరం: మేజర్ పంచాయతీ చోడవరంలో పబ్లిక్ కుళాయిల ద్వారా కలుషితమైన మంచి నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారు. కోటవీధి, శివాలయం వీధి ప్రాంతాల్లో పైపులైన్ల నుంచి మంచినీరు కలుషితం అవ్వడంతోపాటు పురుగులు వస్తున్నాయి. కలుషిత నీరు తాగలేక జనం గగ్గోలు పెడుతున్నారు. పైపులైన్లలో మురుగు కలుషితమై కుళాయిల ద్వారా సరఫరా అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని మంచినీటిని శుభ్రపరిచి సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

దేవరాపల్లి: ప్రతి ఒక్కరూ ఆడి పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈవో బి. పడాల్‌దాస్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజీతో పాటు ఎస్సీ కాలనీలో మంగళవారం బేటీ బచావో..బేటీ పడావో కళా జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలను, భ్రూణ హత్యలు నివారణ, అక్రమ రవాణా నిర్మూలించాలని తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. రాములమ్మ, సీడ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎల్. ఉషారాణి, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎస్.కె. మీరాబి, ఎం. సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలకు చెక్

- మంగళాపురం ఆనకట్ట పనులు ప్రారంభం
- రూ.40 లక్షలతో పునర్నిర్మాణం
- 3 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు



శిథిలమై వర్షాలకు దెబ్బతిన్న మంగళాపురం ఆనకట్ట



ఆనకట్ట వద్ద ప్రారంభమైన నిర్మాణ పనులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనలో ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోంది. పలుచోట్ల పెండింగ్ పనులను పరిష్కరిస్తూ ప్రగతి బాటలు వేస్తోంది. తాజాగా రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే మంగళాపురం, దండి సురవరం, లక్ష్మీపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట, దిబ్బపాలెం, అగ్రహారం, వడ్డాది, తదితర పది గ్రామాలకు చెందిన రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఆయా గ్రామాలకు ఏటా ఖరీఫ్, రబీ రెండు పంటలకు కోనాం రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందించాలి. 3 వేల ఎకరాలకు మంగళాపురం ఆనకట్టు మీదుగా కోనాం రిజర్వాయర్ సాగునీరు రైతుల పొలాలకు అందాల్సి ఉంది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన మంగళాపురం ఆనకట్ట కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పై గ్రామాల రైతుల పొలాలకు సాగు నీరు అందక దిగువకు వృథాగా పోతోంది. స్థానిక నాయకులు, రైతులు మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరారు. వెంటనే అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి ద్వారా రూ. 40 లక్షల ఎంపీ గ్రాంటు మంజూరయ్యేలా కృషి చేశారు. ఆనకట్ట నిర్మాణ పనులకు ఇటీవల విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. శిథిలమైన ఆనకట్ట వద్ద మంగళవారం తుప్పలు, డొంకలను జేసీబీతో తొలగించి భూమి లెవెలింగ్ పనులు చేపట్టారు. రాయి, పిక్క, సిమెంట్ డంపింగ్ చేసి నెల రోజుల్లో ఆనకట్ట నిర్మాణ పనులు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళాపురం, విజయరామరాజుపేట సర్పంచ్లు కంటే పద్మరేఖ వెంకట్, ఎల్లపు విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, నాయకులు జగ్గు, ఆనంద్ తది

పంటలకు పుష్కలంగా నీరు



నాకు నాలుగు ఎకరాలు పొలం ఉంది. కోనాం రిజర్వాయర్ సాగునీరుపై ఆధారపడి పంటలు పండిస్తున్నాం. మంగళాపురం ఆనకట్ట కొట్టుకుపోవడంతో సాగునీరు అందక రెండేళ్లుగా పంటలు బాగా పండలేదు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో ఆనకట్ట నిర్మాణ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉంది. కట్టు పూర్తయితే మరలా పుష్కలంగా రెండు పంటలకు సాగునీరు అందనుంది.

– బుద్ద ఆదినాయుడు ఆదర్శ రైతు, కుముదాంపేట

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్లను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



సత్కరించిన వలంటీర్లతో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కన్నయ్యనాయుడు

మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. పెదబొడ్డేపల్లి శ్రీరాంనగర్ కాలనీ 7వ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సన్మానించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ఇంటి వద్దకే చేరవేసేందుకు సీఎం తీసుకువచ్చిన వలంటీర్ వ్యవ్యస్థ వారధిలా ఉపయోగపడుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేసుకునేందుకు వలంటీర్లు మరింత ఉత్సాహంగా పని చేయాలన్నారు. 16వ వార్డు సచివాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందన కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి పాల్గొని వలంటీర్లను సత్కరించారు.

సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు, సర్పంచ్ గొంప కన్నయ్యానాయుడు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



మట్టవానిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: మట్టవానిపాలెం గ్రామ ఆరాధ్యదైవం పరదేశమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ముందెన్నడూ లేని విధంగా ఈసారి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని ఈ ప్రాంతీయులు కొలుస్తుంటారు. రెండేళ్లకు ఒక సారి జరిగే పండగ సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు వెల్లువలా వచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన చీరలు, కొబ్బరికాయలు, అరటిగెలలు, చెరకు, ధాన్యం మూటలు, బెల్లపు దిమ్మలు మొక్కులుగా చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు. భారీ లైటింగ్ ఎంతగానో ఆకట్టుకుంది. భారీ జెయింట్‌వీల్, రైలు మార్గం, సర్కస్ వంటివి పిల్లలకు మంచి వినోదాన్ని పంచాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా గొంప పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది.

వైవీ సుబ్బారెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే గణేష్



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని మంగళవారం అమరావతిలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో పార్టీ మండలాధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు ఉన్నారు.

పీజీ కోర్సుల అమలుకు కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సీపట్నం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ కోర్సులు అమలుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆయన్ను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ, సభ్యులు కలిశారు. పీజీ కోర్సులు అందుబాటులో లేక గ్రామీణ విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని వాపోయారు. పరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

10న నమామి సాయి శత రుద్రీయం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి బాబా వందో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం 'నమామి సాయి శత రుద్రీయం' కార్యక్రమాన్ని వేచలంలో వచ్చే నెల 10 నిర్వహించనున్నట్లు సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు తెలిపారు. ఈ మేరకు గ్రామ ప్రజలు, పెద్దలు, భగవాన్ సత్యసాయి భక్తులతో కలిసి వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు. అంతకు ముందు సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి అనకాపల్లి జిల్లా సమన్వయకర్త కొరెడ్డి అప్పలనాయుడు, మండల ఇన్‌చార్జి ఆదిరెడ్డి చినకన్నబాబు, జగన్నాథం, వెంకటరావు, పాల సంఘం అధ్యక్షుడు వేచలపు కృష్ణ, మాజీ సర్పంచ్ వంటాకు సింహాద్రప్పడు, రెడ్డి శేషు, నాడు అప్పారావు మాస్టారు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి, వైద్యాధికారి పూజ్య మేఘన

దేవరాపల్లి: వచ్చే నెల 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలదేనన్నారు. వైద్యాధికారి పూజ్య మేఘన మాట్లాడుతూ తొలి రోజు బూత్‌ల్లో పోలియో చుక్కలు వేయాలన్నారు. 4, 5 తేదీల్లో ఇంటింటా సర్వే నిర్వహించి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. హెల్త్ కార్డులను సైతం శత శాతం పంపిణీ చేయాలని, ఫొటోలు, పేర్లు ఇతర వివరాల్లో తప్పులు ఉంటే సరిచేయించాలని సూచించారు. సీహెచ్‌వో పి. ప్రసాదరావు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కె.కోటపాడు: సార్వత్రిక ఎన్నికల సమయానికి తప్పుల్లేని ఓటరు జాబితా తయారీలో బీఎల్వోల పాత్ర కీలకమని తహసీల్దారు జె.ఈశ్వరమ్మ అన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశమయ్యారు. మృతులు, వలసవెళ్లిన వారి ఓట్లను ఆయా బూత్ లెవెల్ ఏజెంట్, గ్రామ పెద్దల సమక్షంలో తొలగించాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు డి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు



వివరాలు సేకరిస్తున్న తనిఖీ బృందం

మాకవరపాలెం: ఉపాధి హామీ నిధుల వినియోగంపై చేపట్టిన సామాజిక తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండలంలోని 31 పంచాయతీల పరిధిలో ఉపాధి నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. వీటిపై ఈ నెల 16 నుంచి గ్రామాల వారీగా తనిఖీలు బృందాలు పర్యటించి విచారణ చేస్తున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేసిన ఉపాధి నిధులపై తనిఖీలు చేశాయి. లబ్ధిదారులకు ఈ నగదు అందిందా లేదా అన్న విషయమై విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నాయి. తనిఖీల అనంతరం ఈ నెల 29న మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జాన్‌లింకన్ తెలిపారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేత చుక్కపల్లి

బుచ్చెయ్యపేటలో ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



హుషారుగా పరుగు తీస్తున్న ఎద్దు

బుచ్చెయ్యపేట: ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని బుచ్చెయ్యపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట, ఐయితంపూడి, దిబ్బిడి, నేతవానిపాలెం, పోలేపల్లి, కందిపూడి, కేపీ అగ్రహారం తదితర చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ శివారులో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం పలువురిని ఆకట్టుకుంది. ఎద్దు రంకెలేస్తూ హుషారుగా పరుగులు తీయడంతో చిన్నారులు, పెద్దలు ఈలలు, కేకలు వేస్తూ సందడి చేశారు. ఈ పందెంలో చుక్కపల్లికి చెందిన పేరపు నూకరాజు ఎడ్ల బండి విజేతగా నిలిచింది. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన నర్సయ్యపేటకు చెందిన మమ్మిన శివతేజ(ద్వితీయ), కాకినాడకు చెందిన గండేపల్లి తాత(తృతీయ), దండి సురవరానికి చెందిన హర్షవర్ధన్ నాయుడు(చతుర్థ), కూండ్రంకు చెందిన మరిడిమాంబ(పంచమి)కు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రికి గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన



బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో రోగులను పరీక్షిస్తున్న కంటి వైద్యుడు



రోగులను పరీక్షిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణుడు అశోక్‌కుమార్

మాడుగుల రూరల్: గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటుతో ఎంతో మేలు కలుగుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం వీరవల్లి అగ్రహారంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్న జగనన్న ప్రభుత్వం ప్రతి పల్లెలో నిరంతరం వైద్య సేవలందిస్తుందన్నారు. వడ్డాది పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ ఆర్. మౌనిక, ప్రత్యేక వైద్యులు కె. సంతోష్‌కుమార్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్), జి. నరేష్(చిన్న పిల్లలు వైద్యులు) ఆప్తాలమిక్ అసిస్టెంట్ పి. నాగలక్ష్మి 280 మందిని పరీక్షించారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఐదుగురికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరావు, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణమ్మ, హరికృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, మాడుగుల ఏఎంసీ డైరెక్టర్లు సయ్యపురెడ్డి నారాయణరావు, దొండా నాగమణి, మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరావు, సీహెచ్‌వో వి. మాధురి, ఏఎన్‌ఎం బి. విజయ, ఫార్మాసిస్టు గోపాలకృష్ణ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సారధ్యంలో ప్రత్యేక స్టాళ్లను ప్రదర్శించారు.

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం మంగళవారం గుడ్డిపలో నిర్వహించారు. ఈ శిబిరంలో చోడవరం సీహెచ్‌సీ గైనిక్ వైద్యనిపుణురాలు స్మృతి, ప్రత్యేక వైద్య నిపుణుడు అశోక్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కీళ్ల నొప్పులు, జ్వరం, ఆస్తమాతోపాటు సాధారణ రోగాలతో హాజరైన 436 మందిని పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రావికమతం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొని విశేష సేవలందించారు.

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష- 2 శిబిరంలో 354 మందికి వైద్య సేవలందించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరం నిర్వహించగా, వైద్యులు రమేష్, అనిల్‌కుమార్, విజయ్ కుమార్, ఉమామహేశ్వరరావు తమ సిబ్బందితో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంతోపాటు కొత్తూరు రోగులు పాల్గొన్నారు. 27 మందికి దృష్టి లోప సమస్యలున్నట్లు గుర్తించి కళ్లద్దాలకు ఎంపిక చేశారు. త్వరలోనే వీటిని అందిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, ఎంపీటీసీ అర్జున అప్పారావు, ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను నాయకులు గణేష్, సోమేష్, ప్రసాద్, రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: కలిగొట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 420 మందికి వైద్య సేవలందించారు. జనరల్ మెడిసిన్ వైద్యుడు సురేంద్ర, డాక్టరు కల్యాణి, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఆర్. గోవిందరెడ్డి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆప్తాలమిస్టు నవీన కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు.

వృత్తి విద్యపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గొలుగొండ: విద్యార్థులకు విద్యతోపాటు వృత్తి విద్యపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక గురుకుల కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషనల్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇక్కడ 9వ తరగతి విద్యార్థులకు ఐటీ- ఐటీ ఈఎస్‌పై నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఉపాధ్యాయులు అమర్నాథ్ పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించండి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచడం, సమస్యలుంటే బీఎల్‌వోల ద్వారా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితాలో ఏమైన తప్పులుంటే తమ దృష్టికి తీసుకువచ్చి సహకరించాలన్నారు.



నాయకులు, అధికారులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

అసంపూర్తి భవనాలు త్వరితగతిన పూర్తి



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: నూతన భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో అత్యవసర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న నూతన భవనాలను వెంటనే పూర్తి చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. డ్రైనేజీలు, సిమెంటు రోడ్డు పనులు చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పని చేయాలన్నారు. ముందుగా పి.కె. గూడెం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి.ఎస్.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.